# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :171 | ప్రచురణ : హైదరాబాద్ | ఆదివారం,3-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00

## ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా..

# పేదలకు ఉచిత వైద్యం

- అమ్మలా పరిణితి చెందుతానంటే ఎగతాళి చేశారు: కవిత
- రాష్ట్రంలో అన్ని వర్గాల రక్షణే తమ పార్టీ ధ్యేయమన్న కవిత
- తాము అధికారంలోకి వస్తే పూర్తి ఉచిత విద్యను అందిస్తామని హామీ
- ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందిస్తామన్న కవిత




తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త రాజకీయ శక్తిగా 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)ను ఆవిష్కరిస్తూ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలోని అన్ని వర్గాల రక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలకు 'అమ్మలా' ఆలోచించే హృదయం లేదని కవిత విమర్శించారు. "నేను అమ్మలా పరిణితి చెందుతానని అంటే చాలా మంది ఎగతాళి చేశారు. కానీ అమ్మలా లాలించి పాలన చేసినప్పుడే ప్రజలకు అసలైన న్యాయం జరుగుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. సామాన్యుడి ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యానికే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, తమ పార్టీ అధికారంలోకి వస్తే విప్లవాత్మక మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు పూర్తి ఉచిత విద్యను అందిస్తామని, దీనికి సంబంధించిన ఆర్థిక ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందని వెల్లడించారు.

తమ ప్రభుత్వం వస్తే... క్యాన్సర్ వంటి మహమ్మారి సోకితే నిరుపేదలు ప్రాణాలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎంత ఖర్చైనా సరే ప్రభుత్వమే భరించి ప్రతి బిడ్డకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు విడుస్తుండటం తనను కలచివేసిందని కవిత అన్నారు. ధాన్యం ఎగుమతి కోసం ప్రత్యేక కమిటీ వేసి రైతులకు మద్దతు ధరతో పాటు ఆత్మగౌరవం కల్పిస్తామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. 18-45 ఏళ్ల యువతకు వారి ఐడియాలజీ ఆధారంగా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామని ప్రకటించారు. సచివాలయం వంటి భారీ కట్టడాల్లో వికలాంగుల కోసం కనీసం ర్యాంప్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు.

## తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు కమిటీలు



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే చెరువుల పునరుద్ధరణకు కమిటీలు వేయాలని నిర్ణయించింది. చెరువుల వారీగా కమిటీలు వేయాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శనివారం

నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. రైతులు, స్థానిక అధికారులు, స్టేక్‌హోల్డర్స్‌తో కమిటీలు వేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేసవిలో చెరువుల పూడికతీతను అత్యవసర ప్రాధాన్యతగా ప్రకటించిన మంత్రి.. అన్ని చెరువుల్లో పనులు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. చెరువుల పరిస్థితి, అభివృద్ధిపై రైతు కమిషన్ ఇచ్చిన నివేదికపై మంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ కమిషన్ ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

## కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదు..

# ప్రజలు మరో 20 ఏళ్లు ఓటు వేయరు



కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి, కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు.ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం - ఉద్యోగుల

## సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది

- ఉద్యోగులకు సీఎం రేవంత్ నాలుగు వరాలు.. పీఆర్సీపై కీలక ఆదేశాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

**జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు**

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

**100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు**

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

**పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం**

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**రెండు నెలలకోసారి సమావేశం**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై,

తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు.

"ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

## బతుకమ్మ కుంట చెరువే.. ఇదిగో పక్కా ఆధారాలు :హైడ్రా కమిషనర్ రంగనాథ్

- బతుకమ్మ కుంటలో చెరువులేదని కోర్టుకు వెళ్లిన సుధాకర్ రెడ్డి.. స్పందించిన హైడ్రా కమిషనర్
- సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం పదెకరాల చెరువు ఉందన్న రంగనాథ్
- భూమికి తానే యజమానిని అని, అక్కడ వ్యవసాయం చేశానని చెబుతున్నారన్న కమిషనర్
- చెరువులో ఉన్న భూమికి పట్టాలు ఎలా వస్తాయని ప్రశ్న



బతుకమ్మకుంటలో అసలు చెరువులేదని బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి కోర్టుకు వెళ్లారని, కానీ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం అక్కడ పదెకరాల్లో చెరువు ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంట చెరువును పునరుద్ధరించడంపై ఎడ్ల సుధాకర్ రెడ్డి కోర్టుకు వెళ్లారు. దీనిపై రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ, చెరువు భూమికి తానే యజమానిని అని, అక్కడ వ్యవసాయం కూడా చేశామని సుధాకర్ రెడ్డి చెబుతున్నారని తెలిపారు.కానీ అసలు చెరువులో ఉన్న భూమికి పట్టాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. చెరువును పూడ్చి కూడా వ్యవసాయం చేయవచ్చని అన్నారు. అలా చేసినంత మాత్రాన చెరువుకు యజమాని అయిపోరు కదా అని వ్యాఖ్యానించారు. చెరువు ఉన్న ప్రాంతంలో నిరుపేదలు ఉంటే వారిని ఖాళీ చేయించి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని అన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉందని తెలిపారు.

# నెలకు 3 వేల ఇళ్లే అమ్మకం పడకేసిన అమ్మకాలు


**హైదరాబాద్, మే 2, :**
హైదరాబాద్ లో ఇళ్ల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా ఈ మేరకు నివేదికలో తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ మూడు నెలల కాలంలో ఇళ్ల ధరల్లో తొమ్మిది శాతం పెరుగుదల ఉంది. ఈ మూడు నెలల్లో కేవలం 9,975 ఇళ్లను మాత్రమే విక్రయించారని నివేదికలు స్పష్టం చేశాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో పాటు సాఫ్ట్ వేర్ రంగంలో నెలకొన్న ఒడిదుడుకులు ఇళ్ల కొనుగోళ్లు తగ్గడానికి కారణమని ప్రధానమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.గతంలో ఎక్కువగా సాఫ్ట్ వేర్ రంగం బలంగా ఉన్నప్పుడు అధికంగా ఇళ్ల విక్రయాలు జరిగేవి. కానీ ఇటీవల ఏఐ ఎఫెక్ట్ తో అనేక కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఉద్యోగంలో భద్రత లేని కారణంగా సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు అత్యధిక ధరను పెట్టి ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. బ్యాంకు లోన్ తీసుకుని ఇంటిని కొనుగోలు చేసినప్పటికీ ఒకవేళ ఉద్యోగం ప్రమాదంలో పడితే అప్పుల భారం ముప్పుగా మారుతుందని అంచనాతో ఇళ్ల కొనుగోలుకు అనాసక్తిని చూపుతున్నారు. హైదరాబాద్ లో అనేక చోట్ల యాభై లక్షలనుంచి అరవై లక్షల రూపాయలకే డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు ఇస్తామంటూ పెద్దయెత్తున బిల్డర్లు సోషల్ మీడియా ద్వారానూ, వివిధ సామాజికమాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. అనేక రాయితీలు కూడా కల్పిస్తున్నారు. జీఎస్టీ మినహాయింపు కూడా ఉంటుందని, మాడ్యులర్ కిచెన్, వుడ్ వర్క్ ఫ్రీగా చేస్తామని ఆఫర్లు ఇస్తున్నారంటే హైదరాబాద్ లో ఇళ్ల అమ్మకాలు పడిపోయాయని తెలుస్తోంది. మరొకవైపు హైడ్రా దూకుడుతో అన్ని రకాలుగా బఫర్ జోన్ లో ఆ ప్రాంతం ఉందా? లేదా? అని తెలుసుకోవడం కూడా కష్టంగా మారి కొనుగోలుకు ఎవరూ ఇష్టపడటం లేదన్నది మరొక వాదన. మొత్తం మీద హైదరాబాద్ లో ఇళ్ల ధరలు తక్కువకే ఇస్తామన్నా కొనుగోలు చేసే వారు మాత్రం లేరు.

# రేవంత్‌ను దెబ్బకొట్టేందుకు.. 'వేం'ను వాడుకున్నారా?



**హైదరాబాద్ :** రాజకీయాల్లో ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు అధికారంలో ఉన్నపార్టీ ఏదైనా చేస్తుందని అంటారు. తెలంగాణలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్.. మూడోసారి వరుసగా విజయం దక్కించుకునేందుకు వేసిన వ్యూహంలో భాగంగా తన ప్రత్యర్థుల కదలికలపై -ఫోన్ ట్యాపింగ్- అస్త్రాన్ని ప్రయోగించిందనే వాదన ఉంది. ఈ క్రమంలోనే లక్షలాది ఫోన్ కాల్స్ విని రికార్డు కూడా చేశారని విమర్శలు ఉన్నాయి. ఓ పెద్ద పోలీసు అధికారికి ఈ బాధ్యతలను అప్పగించారు.
ఇదిలావుంటే.. అప్పట్లో కేసీఆర్‌కు సవాల్‌గా మారిన ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని అదుపు చేసేందుకు కూడా ప్రయత్నాలు సాగినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనకు అత్యంత ఆప్తుడు, ఒకే పార్టీలో గతంలో పనిచేసిన వేం నరేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ టార్గెట్ చేసుకున్నట్టు తాజాగా తెలిసింది. వేం ముఖ్య అనుచ రుడు.. రావుల మురళి ఫోన్‌ను ట్యాప్ చేసినట్టు అధికారులు గుర్తించారు. రావుల-వేం మధ్య వ్యాపార, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య జరిగే సంభాషణను వినడం ద్వారా రేవంత్ రెడ్డిని దెబ్బకొట్టే ప్రయత్నాలు జరిగాయన్నది తాజాగా వస్తున్న ఆరోపణ.రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లాల్సి వచ్చిన 'ఓటుకు నోటు' కేసులో వేం నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందన్న వాదన ఉంది. ఈ క్రమంలో రాజకీయంగా ఏం చేయాల న్నా.. రేవంత్ రెడ్డి-వేంలు కలిసే చేస్తారన్న చర్చ కూడా ఉంది. నిజానికి.. రేవంత్ కాంగ్రెస్‌లోకి రావడంతో.. వేం కూడా ఈ పార్టీ కండువా కప్పుకొన్నారు. రేవంత్ అధికారంలోకి రావడంతో ఆయన ప్రభుత్వ సలహాదారు.. తాజాగా రాజ్యసభ సభ్యుడు కూడా అయ్యారు. ఇలా.. వీరిద్దరి మధ్య అవినాభావ సంబంధం ఉంది.దీనిని గుర్తించిన బీఆర్ ఎస్.. వేం ముఖ్య అనుచరుడు, వ్యాపారి.. రావుల మురళి ఫోన్‌ను ట్యాప్ చేసి.. సుమారు 6 వేలకుపైగా ఫోన్ కాల్స్‌ను విన్నట్టు అధికారులు చెబుతున్నారు. తాజాగా ఆయనను విచారణకు పిలిచారు. చిత్రం ఏంటంటే అధికారులు.. ఆయా ఫోన్ల జాబితాలను ఆయన ముందు పెట్టే వరకు తన ఫోన్ ట్యాపింగ్ అయిన సమాచారం కూడా ఆయనకు తెలియదట.!
నిజానికి రావులను కానీ.. వేంను కానీ.. బీఆర్ ఎస్ టార్గెట్ చేయాల్సిన అవసరం లేదు. కానీ, వీరికి సన్నిహితుడైన రేవంత్ రెడ్డిని నియంత్రించేందుకే ఇలా 6 వేల కు పైగా ఫోన్ కాల్స్‌ను ట్యాప్ చేయాల్సి వచ్చి ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# వెయ్యి రోజుల్లో మనం వస్తున్నాం!: కవిత



**హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సమితి(టీఆర్ ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారని, త్వరలోనే టీఆర్ ఎస్ అధికారంలోకి వస్తుందని ఆమె చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి అరాచక వాదిగా మారారని.. ఆయన అరాచకాలకు మరో 800 రోజులు మహా అయితే.. వెయ్యి రోజుల గడువు మాత్రమే ఉందన్నారు. ఆ తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి.. టీఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్ లో మీడియాతో మాట్లాడిన కవిత.. వెయ్యి రోజుల కార్యాచరణను రెడీ చేస్తున్నామన్నా రు. ప్రతి గ్రామం, మండలం, జిల్లాలో టీఆర్ ఎస్ కోసం ప్రజలు వేయి కళ్లతో వేచి చూస్తున్నారని తెలిపా రు. ప్రజలను పట్టించుకునే తీరిక లేని పాలకులు వద్దని ప్రజలు చెబుతున్నారని అన్నారు. గతంలో కూడా ప్రజలను పట్టించుకోకపోవడం వల్లే.. ఆ నాయకుడు(కేసీఆర్) ఫామ్ హౌస్‌లో పడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హైడ్రా వచ్చింది.. అక్రమార్కులను బెదిరించేందుకు కాదని.. పేదలను బెదిరించి.. వారి ఇళ్లు కూలగొట్టి ముఖ్యమంత్రికి మేలు చేసేందుకు వచ్చిందని కవిత దుయ్యబట్టారు. పేదల ఇళ్లంటే హైడ్రాకు ఆట విడుపుగా మారిందని అన్నారు. ఏ పెద్దల జోలికైనా హైడ్రా వెళ్లిందా? ఏ మంత్రి ఇంటిముందుకైనా హైడ్రా వెళ్లే ధైర్యం ఉందా? మాజీ మంత్రుల అక్రమ ఇళ్లను కూలగొట్టే ధైర్యం ఉందా? అని నిలదీశారు. ఇలాంటి వ్యవస్థ వల్ల ప్రజలకు ఒరిగింది కన్నీరేనని.. పేదలు రోడ్డు పాలవుతున్నారని అన్నారు.

**పాంచజన్యానికి కట్టుబడ్డాం..**
టీఆర్ ఎస్ ఆవిర్భావ వేళ తాను ప్రకటించిన పాంచజన్యం(5 హామీలు) అమలు చేసి తీరుతామని కవిత చెప్పారు. వీటిపై ప్రజలకు అవగాహన కూడా కల్పిస్తామన్నారు. 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామంటే
నవ్వేటోళ్లకు బుద్ధి చెబుతామని వ్యాఖ్యానించారు. లక్ష ఉద్యోగాలను సూపర్ న్యూమరరీ కింద ఉద్యమ కారులకు ఇస్తామంటే నవ్వుతున్నారని.. కానీ, ఇవన్నీ చేసి చూపిస్తామని.. పాంచజన్యం పూరించి.. ప్రజా ద్రోహులను వెళ్ల గొడతామని తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. పనిచేయడం తెలియని వారి గురించి తాను మాట్లాడబోనని పరోక్షంగా కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు.

# జబల్ పూర్ ప్రమాద ఘటనలో కీలక వీడియో.. ముందస్తు లైఫ్ జాకెట్లు ఇవ్వకపోవడం వల్లే పెరిగినమరణాలు..

**హైదరాబాద్ :** జబల్‌పూర్‌లోని బర్గీ జలాశయంలో జరిగిన బోటు ప్రమాదం వింటేనే గుండె తరుక్కుపోతోంది. ఆ మాతృమూర్తి మరీనా, ప్రాణాలు పోయే స్థితిలో కూడా తన కుమారుడు త్రిషాన్‌ను విడిచిపెట్టకుండా అక్కున చేర్చుకొని కనిపించిన దృశ్యం మాతృప్రేమకు నిదర్శనంగా నిలుస్తూ కంటతడి పెట్టిస్తోంది.
మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో నర్మదా నదిపై ఉన్న బర్గీ జలాశయంలో జరిగిన ఈ ప్రమాదం పర్యాటక రంగంలో భద్రతా లోపాలను మరోసారి ఎత్తిచూపింది. ఈ ప్రమాదంలో 28 మంది ప్రాణాలతో బయటపడగా, 9 మంది మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు బోటులోకి నీరు చేరుతుండగా పర్యాటకులు చేసిన హాహాకారాలకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**వెలుగులోకి వీడియో**
ప్రమాదానికి ముందు వెలుగులోకి వచ్చిన వీడియోలో దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడయ్యాయి. బోటు కుదుపులకు గురవుతున్న సమయంలో సిబ్బంది లైఫ్ జాకెట్లకు సంబంధించి మూటలు విప్పుతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. బోటు ఎక్కగానే మొదట ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వాలి కానీ నిర్వాహకులు అలా చేయలేదు. ఇలా చేయకపోవడమే మృతుల సంఖ్య భారీగా పెరిగేందుకు ప్రధాన కారణమని ప్రాణాలతో బయటపడిన వారు ఆరోపిస్తున్నారు. బోటులోకి నీరు వస్తున్న దృశ్యాలు, పర్యాటకులు ప్రాణ భయంతో అరుస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది.

**సహాయక చర్యల్లో కూడా తీవ్ర జాప్యం**
సహాయక బృందాల పనితీరుపై ప్రజలు మండిపడుతన్నారు. సాయంత్రం 6.15 గంటలకు ప్రమాదం జరగగా, సమాచారం అందినప్పటికీ సహాయక బృందాలు 6.40 వరకు బయలుదేరలేదని అంటున్నారు. తమ వాహనం పాడవడం వల్లే ఆలస్యమైందని సిబ్బంది చెబుతుండగా, 7 గంటల సమయంలో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మత్స్యకారులు, రైతులు స్పందించి 15 మందికి పైగా పర్యాటకులను రక్షించి మానవత్వాన్ని చాటుకున్నారు.

**ప్రభుత్వం కఠిన చర్యలు**
ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని క్రూయిజ్ కార్యకలాపాలు, మోటార్ బోట్ సేవలు, వాటర్ స్పోర్ట్స్‌ను నిలిపివేయాలని ఆదేశించారు. క్రూయిజ్ పైలట్ మహేష్ పటేల్, సహాయకుడు ఛోటేలాల్, టికెట్ కౌంటర్ ఇన్‌ఛార్జి బ్రిజేంద్రను విధుల నుంచి తొలగించగా, బోట్ క్లబ్ మేనేజర్ సునీల్ మరావిని సస్పెండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.పర్యాటక ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం, సస్పెన్షన్లు చేయడం పరిపాటిగా మారింది. కానీ, ముందే తగిన జాగ్రత్తలు పాటించి ఉంటే 9 మంది ప్రాణాలు నిలిచేవి. లైఫ్ జాకెట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం నేరంతో సమానం. ఇప్పటికైనా ఇలాంటి వినోద క్రీడల నిర్వహణలో కఠినమైన భద్రతా నియమాలు అమలయ్యేలా చూడాలి.

# ఇరాన్ సెగతో అమెరికాకు కాసుల పంట.. భారీ ఆయుధ ఒప్పందాల వెల్లువ!



**హైదరాబాద్ :** అంతర్జాతీయ రాజకీయాల్లో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ నీతి ఎప్పుడూ చర్చనీయాంశమే. ఒకవైపు ఆ యుద్ధాన్ని నేనే ఆపాను.. ఈ యుద్ధాన్ని నేనే ఆపాను అని ప్రపంచం నమ్మని గొప్పలు చెప్పుకుంటూనే యుద్ధాలను నివారించే పెద్దన్నగా కనిపిస్తూనే, మరోవైపు యుద్ధ భయాన్ని సృష్టించి తన ఆయుధ వ్యాపారాన్ని పెంచుకుంటోందన్న విమర్శలు ఇప్పుడు ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బలపడుతున్నాయి.
ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అమెరికా తన ఆర్థిక లాభం కోసం వాడుకుంటోందనే ఆరోపణలు ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. ఇరాన్‌ను యుద్ధంలోకి దింపడం ద్వారా దాని పొరుగున ఉన్న ఇస్లాం దేశాల్లో అభద్రతా భావాన్ని సృష్టించి, ఆ దేశాలకు భారీగా ఆయుధాలను విక్రయించడమే అమెరికా అసలు అజెండా అని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చల పేరుతో ఇరాన్ యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చి, ఈ విరామ సమయంలో తన వెపన్ మార్కెట్‌ను అగ్రరాజ్యం విస్తరిస్తోంఽని చెప్పేందుకు భారీ డీల్ ఉపయోగపడుతుంది.

**భారీ ఆయుధ ఒప్పందం**
ఇరాన్ తమపై దాడి చేయవచ్చనే భయంతో ఉన్న నాలుగు దేశాలకు అమెరికా భారీ ఎత్తున యుద్ధ సామగ్రిని విక్రయించేందుకు సిద్ధమైంది. మొత్తం ౨9 బిలియన్ల (దాదాపు రూ. 85,000 కోట్లు) విలువైన ఆయుధాల విక్రయానికి ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్, కువైట్, ఖతర్, మరియు యూఏఈ (ఖాజు)కి ఈ ఆయుధాలను సరఫరా చేయనున్నారు. ఇరాన్ నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేందుకు ఈ దేశాలకు అత్యాధునిక వెపన్స్ అవసరమని అమెరికా ఈ డీల్ సమర్థించుకుంటోంది.

**మార్కో రూబియో వేగం**
అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ ఒప్పందంపై అత్యంత వేగంగా స్పందించారు. ఆర్డర్ ప్లేస్ చేసిన దేశాలకు ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే ఆయుధాలను పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఉద్రిక్తతలు ఉన్నప్పుడే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఈ లోపు ఆయుధాల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అగ్రరాజ్యం భావిస్తోంది.

**యుద్ధమే పెట్టుబడి!**
అమెరికా విదేశాంగ విధానంపై అంతర్జాతీయ నిపుణులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఇరాన్ సమీప ఇస్లాం దేశాలపై దాడి చేసే అవకాశం ఉందంటూ కృత్రిమంగా యుద్ధ భయాన్ని సృష్టించి, తన వెపన్ మార్కెట్‌ను పెంచుకోవడమే అమెరికా ప్రధాన అజెండా అని విమర్శకులు మండిపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గొడవలు జరిగినా, అక్కడ అమెరికా ఆయుధాలు ప్రత్యక్షమవ్వడం వెనుక పెద్ద ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని వాదిస్తున్నారు.ఒకవైపు ఇరాన్ అణు కార్యక్రమాలపై ఆంక్షలు విధిస్తూ, మరోవైపు ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణాన్ని వేడెక్కించడం ద్వారా అమెరికా తన ఖజానాను నింపుకుంటోంది. ఈ క్రమంలో రూ. 85 వేల కోట్ల విలువైన ఆయుధ ఒప్పందం పశ్చిమాసియాలో ఆయుధ పోటీని మరింత పెంచే ప్రమాదం ఉంది. శాంతిని నెలకొల్పాల్సిన అగ్రరాజ్యం, యుద్ధాన్ని ఒక వ్యాపారంగా మార్చుకోవడం ప్రపంచ భద్రతకు పెను ముప్పుగా పరిణమించవచ్చు.

# రికార్డు స్థాయికి తెలంగాణ ఆదాయం

## ఏప్రిల్‌లో 35% వృద్ధి

## దూసుకుపోయిన జీఎస్టీ వసూళ్లు!

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అత్యధిక వసూళ్లను నమోదు చేస్తూ చరిత్ర సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ (GST) వసూళ్లలో 35 శాతం భారీ వృద్ధి నమోదైనట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**జీఎస్టీ చరిత్రలోనే అత్యధికం**
రాష్ట్రానికి ఏప్రిల్ 2026లో ఏకంగా రూ. 4,621 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ. 3,433 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అదనంగా రూ. 1,188 కోట్లు వసూలైంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చినప్పటి నుండి ఒక నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం ఇదే మొదటిసారి.

**వరుస విజయాలు:**
గత నాలుగు నెలలుగా తెలంగాణ జీఎస్టీ ఆదాయం స్థిరంగా రూ. 4,000 కోట్లకు పైగానే నమోదవుతోంది.

**మొత్తం ఆదాయం:**
జీఎస్టీతో పాటు పెట్రోల్, మద్యంపై వ్యాట్ (వాూ), వృత్తి పన్నులను కలుపుకుని మొత్తం రూ. 7,570 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేరింది.

**దేశంలోనే రెండో స్థానం:**
పన్ను వసూళ్ల వృద్ధి రేటులో కర్ణాటక తర్వాత తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి తన ఆర్థిక సత్తాను చాటింది.

# టీచర్లు... మీరు సూపర్...

## సోషల్ మీడియాలో ప్రశంసలు

**కరీంనగర్, మే 2, :**గొప్పగా సౌకర్యాలు కల్పించినప్పటికీ.. ఉచితంగానే అన్ని ఇస్తున్నప్పటికీ చాలామంది ప్రభుత్వ పాఠశాలలో చదవడానికి ఆసక్తిని చూపించడం లేదు.. వేలకు వేలు పెట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చదవడానికి మాత్రమే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో సక్రమంగా బోధించరని.. ఉపాధ్యాయులలో జవాబుదారితనం ఉండదని.. దీనివల్ల తమ పిల్లల భవిష్యత్తు ఆగమవుతుందని చాలామంది తల్లిదండ్రులు ఆలోచిస్తారు. అందువల్లే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు కాకుండా.. ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు.కొంతకాలంగా ప్రభుత్వం పాఠశాలల మీద ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఫలితాలు, డ్రాప్ అవుట్ల మీద ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నది. ఫలితాలు సరిగ్గా రాకపోతే ఉపాధ్యాయులకు నోటీసులు పంపిస్తున్నది. వారి నుంచి వివరణ కూడా కోరుతున్నది. డ్రాప్ అవుట్లు అధికంగా ఉంటే ఆ పాఠశాలలను తొలగించి.. అక్కడ విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పిస్తున్నది. ఇది ఒక రకంగా ఉపాధ్యాయులకు ఇబ్బందికరమైన పరిణామం.. విధులు నిర్వహిస్తున్న పాఠశాల మూసివేతకు గురైతే.. ఉపాధ్యాయులకు దూరం వెళ్లాల్సి ఉంటుంది. అది ఒక రకంగా వారికి ప్రయాస. అందువల్లే డ్రాప్ అవుట్లను తగ్గించడానికి.. ఫలితాలను పెంచడానికి ఉపాధ్యాయులు కష్టపడుతున్నారు. కాకపోతే ఈ స్టోరీలో ఉపాధ్యాయులు చూపించిన ప్రయత్నం పూర్తి విభిన్నం.. పైగా 10 ఫలితాలు విడుదలైన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి పరిధిలోని ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామం. ఇక్కడ ప్రభుత్వ పాఠశాల ఉంది. టెన్త్ వరకు ఉన్నప్పటికీ.. విద్యార్థులు అంతగా చేరలేదు. ఒకే ఒక విద్యార్థి ఇక్కడ టెన్త్ చదువుతున్నాడు. అతడు కూడా సక్రమంగా పాఠశాలకు రావడం లేదు. ఆ విద్యార్థి పేరు గుంటి మధు. అతడు ఎంతకీ పాఠశాలకు రాకపోవడంతో ఉపాధ్యాయుల్లో భయం పట్టుకుంది. ఒకవేళ అతడు గనక ఫెయిల్ అయితే పరిస్థితి తారు మారవుతుంది.. అందువల్లే ఉపాధ్యాయులే నడుం బిగించారు. విద్యార్థికి బదులుగా వారే పాఠశాల నుంచి అతని ఇంటికి వెళ్లారు. ప్రతిరోజు పాటలు చెప్పడం మొదలుపెట్టారు.. పట్టువదలని విక్రమార్కుల మాదిరిగా అతడిని పాస్ చేయించారు.. మధు 429 మార్కులతో పదో తరగతి పాస్ అయ్యాడు. అతడు పాస్ కావడంతో జీరో పర్సెంట్ రాలేదని ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**న్యూస్ ఇండియా తెలుగు మే 2.** మహబూబాబాద్ జిల్లా బయ్యారం:... మండలంలోని కొత్తపేట జిపిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ శనివారం ప్రారంభించారు. సొసైటీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,రైతులు పండించిన పంటలకు సరైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటను విక్రయించవచ్చని సూచించారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర ఇంచార్జ్ లు చల్ల సురేష్,వడ్డే ఉదయ్,ఉపసర్పంచ్ రావి వీరభద్రరావు,కారుబోతుల రామ్మూర్తి,భానోత్ రాజు,వార్డు సభ్యులు బొమ్మ కంటి రాంబాబు, భూక్య శ్రీను,పంచాయతీ కార్యదర్శి జక్కి రఘువీర్,వడ్లమూడి కోటేశ్వరరావు,చల్లా కృష్ణ,కండెపునేని సుధాకర్,దేవినేని వెంకటరామారావు, బుర్ర దుర్గారావు,పెనుగొండ పుల్లయ్య, జంపాల కుమార్,భాస్కర్,వెంకన్న,ఆదినారాయణ,దేరంగుల రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సీఎం సహాయనిది ఒక వరం..

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.
- నరాల చికిత్సకు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు..
- లింగోజిగూడకు చెందిన బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ చెక్కు మంజూరు..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 2, న్యూస్ ఇండియా ప్రతినిధి:**పేద ప్రజలు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియలో నివసిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి నరాలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్నారు. చికిత్సకు అవసరమైన వ్యయం భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చుల వివరాలతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణలో సీఎం సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం వరంలా నిలుస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మాధవరం నర్సింహారావు, రుద్ర యాదగిరి నేత తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండలో వృద్ధుల ఇబ్బందులు.

**న్యూస్ ఇండియా తెలుగు మే 2. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:....**మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ద్వారా ఆసరా పెన్షన్ దారులకు ప్రతినెల ఆసరాను అందజేయడం పరిపాటిగా మారింది.ఏప్రిల్ ఆసరా పెన్షన్ కోసం శనివారం కొత్తపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో పెన్షన్ కోసం మండుటెండలో వృద్ధులు, మహిళలు,వికలాంగులు పెన్షన్ డబ్బుల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.ఆసరా పెన్షన్ నెలకు 2016 ఇవ్వవలసి ఉండగా, అన్ని రకాల పెన్షన్ లబ్దిదారులకు పైన 16 రూపాయలు ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి.అధికారులు స్పందించి సక్రమంగా ప్రభుత్వం అందించిన ఆసరా పెన్షన్ సక్రమ మార్గంలో ఆసరా లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలని పలువురు వేడుకుంటున్నారు.దీనిపై కొత్తపేట పోస్ట్ ఆఫీస్ బీపీఎం గట్టు కమలాకర్ ను వివరణ కోరగా ఆరోగ్యరీత్యా మూడు నెలలు సెలవు పెట్టానని ,ఏబిపిఎమ్ బాలాజీ ఒక్కరే ఉండటంతో గ్రామ పంచాయితీలో ఆసరా పెన్షన్ల పంపిణీ వేరే వారికి అప్పజెప్పడం జరిగిందని వారు పంపిణీ



చేయడంలో కొంత ఆలస్యం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

# పేదలకే పథకాల ఫలాలు చేరాలి..



అర్హులందరికీ అందితేనే ప్రభుత్వ లక్ష్యం..

అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి..

'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం..

**రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, మే 2, న్యూస్ ఇండియా ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం సార్థకమవుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. పథకాల అమలులో అధికారుల బాధ్యత అత్యంత కీలకమని, విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే సహించబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం బొంగ్లూర్ గేటు సమీపంలోని ప్రమీదా గార్డెన్స్‌లో శుక్రవారం నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అబ్దుల్లాపూర్మెట్, మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ముఖ్యమంత్రి సందేశాన్ని ఆర్డీవో అనంతరెడ్డి చదివి వినిపించారు. అనంతరం మార్చి 6 నుంచి గ్రామ, మండల స్థాయిలో చేపట్టిన కార్యక్రమాల అమలుపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతు భరోసా, పెన్షన్లు, డ్వాక్రా రుణాలు తదితర పథకాల అమలుపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పేద ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ లక్ష్యం నెరవేరాలంటే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశానికి ముందు వ్యవసాయ, వైద్యారోగ్య, ఐసీడీఎస్, ఐకేపీ, ఉద్యానవన తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా శాఖల పనితీరు ఉండాలని సూచిస్తూ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు గురునాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి, ఎంపీడీవో పరిమళ నాయక్, బాల శంకర్, రాధా రాణి, శ్రీ వాణి, ఎమ్మార్వో సునీత, సుదర్శన్, ప్రసాదరావు, అయ్యప్ప మున్సిపల్ కమిషనర్లు సుదర్శన్, సత్యనారాయణ రెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్ రిమాండ్-సిఐ రవీందర్.



**న్యూస్ ఇండియా తెలుగు మే 2. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..**మండల కేంద్రంలోని జగ్గు తండా పంచాయతీ పరిధిలో దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మర విజయ తాళం వేసిన ఇంటిలో అదే గ్రామానికి చెందిన కొమ్మిరి అరుణ్(22)కొమ్మిరి సాయి(19) అనే ఇద్దరు వ్యక్తులు గత నెల 28న అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు.బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రశాంత్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా నిందితులను పట్టుకుని దొంగిలించిన బంగారంలో పదిహేను గ్రాముల బంగారాన్ని మహబూబాబాద్ సాయి రామ్ అనే వ్యక్తికి 70వేల అమ్మినట్లు తెలిపారు.మిగిలిన బంగారాన్ని అమ్మడానికి వెళ్తున్న క్రమంలో శనివారం జగ్గతండా ఎక్స్ రోడ్ వద్ద పోలీసు వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని నిందితుల నుండి 20.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా కేసును ఛేదించిన ఎస్ఐ ప్రశాంత్ బాబుని, సిబ్బందిని సిఐ ఎల్.రవీందర్ అభినందించారు

## తొర్రూర్ బీరప్ప స్వామి పండుగకు రూ.50 వేల విరాళం..

కురుమ సంఘం కుల పెద్దలకు అందజేసిన ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 02, న్యూస్ ఇండియా ప్రతినిధి:**తొర్రూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని కురుమ సంఘం కుల పెద్దలకు అందజేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తొర్రూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించనున్న 10 రోజుల దైవ కార్యక్రమాలకు హాజరుకావాలని తొర్రూర్ కురుమ సంఘం ప్రతినిధులు మర్రి నిరంజన్ రెడ్డిని ఆహ్వానించారు. గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలు గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రతీకగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద కుర్మ సాగ లక్ష్మయ్య, కురుమ సంఘం కుల పెద్దలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకం లక్ష్మి, జంగయ్య, లింగం, శ్రీశైలం, యాదగిరి, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏను మామూలు మార్కెట్ నందు సీసీ కెమెరాలు ప్రారంభించిన మంత్రి కొండా

**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)** ప్రజా పాలన. - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఏనుమాముల మార్కెట్ నందు ప్రారంభించిన గౌరవనీయులు శ్రీమతి కొండ సురేఖ రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ, దేవాదాయ శాఖ. మంత్రివర్యులు మరియు గౌరవ. శ్రీ కె ఆర్. నాగరాజు వర్ధన్నపేట శాసనసభ్యులు

ప్రజా పాలన, -ప్రగతి ప్రణాళికలో భాగంగా తేదీ 02 మే 2026 రోజున ఉదయం 8 గంటలకు శ్రీమతి కొండా సురేఖ రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ శాఖ, దేవాదాయ శాఖ మాత్యులు మరియు గౌరవ శ్రీ కె ఆర్ నాగరాజు. వర్ధన్నపేట శాసనసభ్యులు వారిచే వ్యవసాయ మార్కెట్ కమిటీ వరంగల్ (ఏనుమాముల) నందు నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పత్తి, మిర్చి, పసుపు, పల్లి కాయ. గేట్ , 1 గెట్ 2. వార్డుల యందలి షెడ్లు మరియు ప్రధాన కార్యాలయము నందు మొత్తం (100) మరియు లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ నందు. (20). సీసీ కెమెరాలను ప్రధాన కార్యాలయము నందు ఏర్పాటు. చేసిన సీసీ టీవీ రూమ్ నందు ప్రారంభించడం జరిగింది

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరంగల్ శ్రీమతి. సత్య శారద అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) వరంగల్ శ్రీమతి సంధ్యారాణి , శ్రీమతి కె సురేఖ జిల్లా మార్కెటింగ్ అధికారి. వరంగల్. సి ఆర్ మల్లేశం ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీ బొమ్మినేని రవీందర్ రెడ్డి అధ్యక్షులు. శ్రీ మాడూరి వేద ప్రకాష్ కార్యదర్శి శ్రీ సాగర్ల శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీ వరంగల్ చాంబర్ ఆఫ్. కామర్స్. ఒ ఇండస్ట్రీస్. చింతల పెల్లి. వీరా రావు కాటన్ సెక్షన్ అధ్యక్షులు శ్రీ ఎస్ రాము కార్యదర్శి గ్రేడ్, 2 , శ్రీ జి రాజేందర్. ఎస్ అశోక్. సహాయ కార్యదర్శులు. , ఇతర అధికారులు ప్రజా ప్రతినిధులు మరియు మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు .



# అంగన్వాడి సెంటర్ లో టి హెచ్ ఆర్ పంపిణీ చేసిన సర్పంచ్ తాళ్లూరి స్వప్న



**చింతకాని న్యూస్ ఇండియా ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగన్నాథపురం అంగన్వాడి సెంటర్లో టి హెచ్ ఆర్ గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లకు సెలవు దినాలు ప్రకటించింది. ఈ నెల 1 నుండి 31. వరకు కేంద్రాలకు సెలవులు ఇవ్వడంతో ఈ నెల మొత్తం రేషన్ ను శనివారం గర్భిణీ లకు, బాలింతలకు, 6 నెలల పిల్లల నుండి మూడు సంవత్సరాల వయసు పిల్లలకు , ప్రి స్కూల్ పిల్లలు కు ( టి హెచ్ ఆర్ ) బియ్యం పప్పు నూనె పాలు కోడిగుడ్లు లను టేక్ హోమ్ రేషన్ పంపిణి చేసారు . ఈ కార్యక్రమంలో. అంగన్వాడీ టీచర్ కాసిమాల వెంకమ్మ, ఏఎన్ఎం రజిని, ఆశ వర్కర్ బందెల అరుణ, ఆయా యరమాల పద్మ , గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# పెంట్లవెల్లి రైతులకు తీపికబురు: గ్రామంలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వనపర్తి జిల్లా న్యూస్ ఇండియా ప్రతినిధి** పెంట్లవెల్లి కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండల కేంద్రంలో రైతుల చిరకాల కోరిక నెరవేరింది. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇన్నాళ్లూ మొక్కజొన్న విక్రయానికి రైతులు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, రవాణా ఖర్చులు, దళారుల దోపిడీతో నష్టపోయేవారని అన్నారు. ఈ కేంద్రంతో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు.

అధికారులకు ఆదేశాలు రైతు పంట తీసుకువస్తే వెంటనే తూకం వేయాలి. లారీలు లేవనే మాట ఎక్కడా వినిపించకూడదు" అని మంత్రి స్పష్టం చేశారు.

రైతులకు సూచన: నాణ్యత ప్రమాణాలు పాటించి పంటను ఆరబెట్టి తీసుకురావాలి. నాణ్యత ఉంటేనే ప్రభుత్వ మద్దతు ధర పూర్తిగా లభిస్తుంది. కంగారు పడవద్దు" అని మంత్రి భరోసా ఇచ్చారు.

రెండు ప్రధాన లాభాలు:లి ఈ కొనుగోలు కేంద్రం వల్ల రైతులకు రవాణా ఖర్చు మిగలడంతో పాటు దళారులకు కమీషన్లు చెల్లించాల్సిన అవసరం ఉండదు. పంటను నేరుగా ప్రభుత్వానికి అమ్మి మద్దతు ధర పొందవచ్చు.

కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# హార్వెస్టర్ మిషన్ కు లోన్ మంజూరు చేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు నాగులవంచ సిబ్బంది.



**చింతకాని న్యూస్ ఇండియా ప్రతినిధి** చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలో రావట్ల రావూట్ల వెంకటేశ్వర్లు గోదాప్రసాద్ నూతన వరి కోత మిషన్ కొనుగోలు చేశారు. ఈ నూతన వరి కోత మిషన్కు కొబ్బరికాయ కొట్టి రిబ్బెను కట్ చేసి ప్రారంభించిన ఏజీఎం. ప్రసన్న కుమార్. అనంతరంవారు మాట్లాడుతూవ్యవసాయంలో యంత్రాల పాత్ర కీలకంగా మారింది. రైతులకు వరి కోత యంత్రాలు వరంగా మారాయి. ఒక ఎకరం వరి పంటను మనుషులతో కోత కోసి ధాన్యంగా మార్చాలంటే ఐదు రోజుల సమయం పడుతుంది. సుమారు 30 మంది కూలీలు అవసరం అవుతారు. వారం రోజులు పాటు శ్రమిస్తేనే వడ్లు ఇంటికి వచ్చేవి. అయితే వరి కోత యంత్రాలు రావడంతో గంటలో ఒక ఎకరం పొలాన్ని కోసుకొని ఇంటికి తీసుకువస్తున్నామని రైతులు తెలియపరిచారు .

ఈ కార్యక్రమం లోసిఎంబి సురెడ్డి, ఏ ఎమ్ హెచ్ రాపర్తి నగర్ మేనేజర్ రవికాంత్,బ్యాంకు మేనేజర్ నాగ సురేష్,ఫీల్డ్ ఆఫీసర్ గీతాంజలి కరణ, గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు,బండి సైదులు, మడిపల్లి రామకృష్ణ, గోగుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# తమపై వచ్చిన ఆరోపణలు ఖండించిన దేవాలయ సహాయ కమిషనర్ రామల సునీత.

**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**తేది.29.04.2026 రోజున వరంగల్ ప్రెస్ క్లబ్ నందు ఆర్. హెచ్.పి దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చీకటి రాజు అధ్యక్షతన ప్రెస్మీట్ నందు అసిస్టెంట్ కమీషనర్, శ్రీమతి రామాల సునిత పై చేసిన అసత్య ఆరోపణలపై అధికార దుర్వినియోగం, పరిపాలన నిర్లక్ష్యం, దేవాలయ భూముల ఆక్రమణలపై చేసిన వార్తలు పూర్తిగా అవాస్తవమని. అట్టి ప్రెస్ క్లబ్ నందు చెప్పబడిన విషయాలపై అందుకు తీసుకున్న చర్యలు ఈ క్రింది విధంగా రామల సునీత. తెలియచేశారు.

1. శ్రీ మెట్టురామలింగేశ్వర స్వామి దేవస్థానము, సర్వేనెం. 1079/ఏ లో ఎ 1-33 గుం॥ రామాల సునిత మామ కుమ్మరి సారయ్య పేరుతో కబ్జా, శ్రీ మెట్టుగుట్ట శ్రీ సీతారమాచంద్ర స్వామి దేవస్థానము, సర్వేనెం.1075 లో 4 ఎకరముల భూమిపై కంప్లైన్ చేస్తే కబ్జా దారులు అధికారి కబ్జాపై ప్రశ్నించలేదు. మా దగ్గరకు వస్తున్నారా అంటు విమర్శిస్తున్న వైనం.

ఖండన:- ఇది పూర్తిగా అవాస్తవం. శ్రీ కుమ్మరి సారయ్య 1985 సం॥ లోనే సదరు భూమిని కోనుగోలు చేయడం జరిగినది. 2018 సం॥ లో నాకు కుమ్మరి అమర్నాథ్ వివాహం జరిగినది. తదనంతరం 2019 లో మా మామ చనిపోయినారు. మా మామగారైన సారయ్య పేరున ఉన్నప్పటికి భౌతికంగా పరిశీలించిన మీదట దేవస్థాన భూమితో కలిసి ఉండుట వలన దేవుని ఆస్తిపై వాజ్యం వేయుట ఇష్టం లేక వదిలివేసినట్లుగా నా భర్త ద్వారా తెలియవచ్చినది. కనుక అట్టి భూమికి నాకు ఎటువంటి సంబంధం లేదు. నేను ఇట్టి విషయంలో ఎటువంటి క్లెయిములు చేయుట లేదు. మరియు ఎటువంటి దురాక్రమణలకు పాల్పడలేదు.

2. శ్రీ మెట్టుగుట్ట శివాలయంలో 14 కిలోల వెండి మాయంపై కూడా ఎటువంటి విచారణ గాని, చర్యలు గాని తీసుకోకపోవడం

ఖండన:- ఈ ఫిర్యాదు పూర్తిగా అవాస్తవం. గతములో పనిచేసినటువంటి ఉప కమీషనర్, దీనిపై విచారణ చేసి నివేదిక కమీషనర్ కి అందచేయడం జరిగినది. ఎంక్వరి అఫీసర్ను నియమించడం జరిగినది. మరియు అట్టి ఎంక్వరి పెండింగ్లో కలదు.

3. శ్రీ భద్రకాళి దేవస్థానములో వాహనాల పుజా టిక్కెట్ల అక్రమాలపై అసలు దోషిపై ఎటువంటి విచారణ లేదు. నామా మాత్రంగా క్రింది స్థాయి ఉద్యోగులపై సస్పెన్షన్.

ఖండన:- ఇది పూర్తిగా అవాస్తవం. హస్తవం. పూజా టిక్కట్ల అక్రమాలు చేసిన ఉద్యోగులపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరిగినది, మీరు చేస్తున్న ఆరోపణలు అసలు దోషి ఎవరో సరైప ఆధారలతో నిరుపణ చేస్తే వారిపై చర్యలు తీసుకోబడును.

4. శ్రీ భద్రకాళి దేవస్థానములో పులిహోర కుంభకోణంలో ఎటువంటి విచారణ లేదు.

ఖండన:- ఆలయంలో పులిహోర ప్రసాదం వితరణకు సంబందించినటువంటి కిరాణ సామాగ్రి, తయారుచేసే విధానం అన్ని నిభందనలకు అనుగుణంగా పారదర్శకత్వంతో జరుగుచున్నది. ఇప్పటివరకు పులిహోర కుంభకోణంపై ఎటువంటి ఫిర్యాదు ఇ.ఓ కార్యాలయమునకు అందలేదు. ఇది పూర్తిగా అవాస్తవం.

5. శ్రీ భద్రకాళి దేవస్థానములో ప్రముఖ వ్యక్తి 13 తులాల బంగారు ఆభరణాలు కాజేసే విషయంపై ఎంటువంటి విచారణ లేదు. ఒక భక్తుడు ఏటా ఇచ్చే విరాళం 1,50,000/- కాజేతపై ఎటువంటి విచారణ చేయలేదు.

ఖండన:- ఇది పూర్తిగా అవాస్తవం. భక్తులు ఇచ్చే బంగారు ఆభరణం దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టంకు లోబడి ధర్మకాంట బిల్ తీసుకొని రశీదు ఇచ్చిన అనంతరము వస్తువును హాండోవర్ చేసుకొని, ఇన్వెంటరీ రిజిష్టర్ యందు నమోదు చేసి, బ్యాంకు లాకర్లో భద్రంగా భధ్రపర్చడం జరుగుతుంది. అదేవిధంగా భక్తులు ఇచ్చే విరాళాలు కూడా నిబందనలకు అనుగుణంగా విరాళాల రశీదులు ఇచ్చిన అనంతరం అట్టి మొత్తాన్ని బ్యాంకులో జమచేయడం జరుగుచున్నది.

6. అప్పటి ఇ.ఓ శ్రీమతి శేషభారతి ప్రోటోకాల్ కండువాల ఖర్చుపై 56,00,000/- అవకతవకలు చేయడంపై కూడా ఎటువంటి విచారణ చేయలేదు.

ఖండన:- ఇది పూర్తిగా అవాస్తవం. పై ఆరోపణలకు సంబందించిన ఎటువంటి ఫిర్యాదులు కార్యాలయమునకు వచ్చియుండలేదు.

బ్యాంకులో జమచేయడం జరుగుచున్నది.

7. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము ఉద్యోగి నిబందనలకు విరుద్దంగా కారు డ్రైవర్గా నియమించుకోవడం.

ఖండన:- పై ఫిర్యాదు పూర్తిగా అవాస్తవం. సదరు ఉద్యోగి సహాయ కమీషనర్, కార్యాలయము యందు రికార్డు డిజిటలైజేషన్ చేసే క్రమములో ఆఫీసుకు డిప్యుటేషన్ వేయడం జరిగినది. అంతేకాకుండా ప్రత్యేకంగా అట్టి ఉద్యోగి డ్రైవర్ నియమించడం జరగలేదు.

8. అన్యమతస్తులను వరంగల్ ఎండోమెంట్ ఆఫీసులో నియమించుకోవడం ఆధారాలు సమర్పించిన, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం.

ఖండన:- సదరు ఫిర్యాదుకు సంబందించి గతములో పనిచేసినటువంటి ఉప కమీషనర్ శ్రీమతి కె.ఎన్. సంధ్యారాణి ఇద్దరు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి వారి స్తానంలో కొత్తవారిని నియమించుకోవడం జరిగినది. అట్టి విషయం దృష్టికి వచ్చిన వెంటనే దేవాదాయ శాఖ కమీషనర్ తేది. 28.04.2026 రోజున అట్టి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి, పాతవారినే నియమించుటకు ఉత్తర్వులు జారీచేయడం జరిగినది.

9. నిబందనలకు విరుద్ధంగా శ్రీ భద్రకాళి దేవస్థానం వంశపారం పర్యం అయిన హక్కును పొందిన డాక్టర్ శివసుబ్రమణ్యం గారిపై ఎటువంటి విచారణ చేయకపోవడం.

ఖండన:- ఇది పూర్తిగా అవాస్తవం. శ్రీ భద్రకాళి దేవస్థానం నందు బండారి వంశస్తులకు వంశపారంపర్య హక్కులను కల్పిస్తు గతములోనే దేవాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారంగా వారసుడైన డాక్టర్ శ్రీ శివసుబ్రమణ్యం గారికి ధర్మకర్తగా ప్రభుత్వం వారు గుర్తింపు కలుగచేసినారు. కనుక ఇట్టి విషయములో ఇ.ఓ కి గాని, లేదా సహాయ కమీషనర్ కి గాని విచారణ పరిధిలేదు.

10. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు దేవాలయాలలో పూజా కైంకర్యాలలోని ఉన్న లోపాలు, అవినీతి, పలు దేవాలయ భూముల అక్రమాలపై పలు ఫిర్యాదులుచేసినప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహిరంచడం.

ఖండన:- ఇది కూడా పూర్తిగా అవాస్తం. ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ పరిదిలో ఉన్న అన్ని దేవాలయాలకు ఆయా కార్యనిర్వహణాధికారి గార్లచే ఆక్రమణ దారులపై కేసులు వేయగా కొన్ని పెండింగ్లో కలవు. ఈ క్రమములో ఆక్రమణ దారులపై సత్వర చర్యలకు ఉన్నతాదికారులకు నివేదికలు పంపుట, మరియు సంబందిత కార్యనిర్వహణాధికారి గార్లకు సూచనలు జారీచేసి, తొలగింపునకు చర్యలు జరుగుచున్నవి.

11. క్రింది స్థాయి ఉద్యోగులకు అవినీతి ప్రోద్బలంగా వ్యవహరిస్తున్నట్టు అనిపిస్తుంది.

ఖండన:- పై ఫిర్యాదు పూర్తిగా అవాస్తం. క్రింది స్థాయి సిబ్బంది పై ఎటువంటి లిఖిత పూర్వక ఫిర్యాదులు వచ్చినను వెంటనే స్పందించి, నిర్ధారణచేసి, తగు చర్యలకుగాను ఉన్నతాధికారులకు తెలుపుట జరుచున్నది. ఈ క్రమములో ప్రస్తుతం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము, రామన్నపేట, వరంగల్ మరియు శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవస్తానము, కొమ్మాల, కార్యనిర్వహణాధికారి గార్లపై వచ్చిన ఫిర్యాదులకు దేవాదాయ శాఖ కమీషనర్ అట్టి అభియోగములపై విచారణ చేయుట జరుగుచున్నది. తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదికలు సమకూర్చుట కూడా జరుగుచున్నది. ఈ విధంగా నాయొక్క పరిధిలో గల అన్ని దేవాలయాల ఆస్తులపై నిర్వాహకులపై మరియు క్రింది స్థాయి సిబ్బందిపై పరిపాలన పరంగా అన్ని విషయములలో దేవాదాయ శాఖ సమగ్రతను కాపాడే విధంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేయుట జరుగుచున్నది. అట్టి క్రమములో పరోక్షంగా నష్టం వాటిల్లే కొంత మంది వ్యక్తులు సమూహంగా ఏర్పడి అభియోగములు చేయుట విచారణకరమని తెలియజేస్తూ ఇకపై ఎటువంటి నిరాధార ఆరోపణలు చేసినవారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయుట ద్వారా, చట్టపరమైన చర్యలు తీసుకోనబడునని తెలియచేయడం అయినది.

# చింతకాని గ్రామంలో చలి వేంద్రం ఏర్పాటు




**చింతకాని న్యూస్ ఇండియా ప్రతినిధి** .చింతకాని గ్రామ పంచాయతీ ముత్యాలమ్మ గుడి దగ్గర చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో చలి వేంద్రంను ఉప సర్పంచ్ కోలా ఉమారాణి ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో చింతకాని గ్రామ సెక్రటరీ వార్డు సభ్యులు వేముల కొండలరావు, పొనుగోటి బాబు,

గ్రామ ప్రజలు కోలా నాగేశ్వరరావు పాల్గొనడం జరిగింది.

# పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

- ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండ
- స్వయం సహాయక సంఘాల రుణాలతో మహిళా సాధికారత సాధ్యం
- నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా
- ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా ప్రతినిధి** ,పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని కమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ. 6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండగా నిలుస్తోందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 86 మందికి రూ. 86.09 లక్షల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆకాంక్షిస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ. 5.25 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసా అని, నియోజకవర్గంలోని 72 మంది బాధితులకు రూ. 35 లక్షల విలువైన వైద్య సహాయం మంజూరైందని వివరించారు. ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి అని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గం లోని ప్రతి పేదవాడి కష్టంలో పాలుపంచుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు కమిషనర్ సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల ఎమ్మార్వో పుల్లయ్య, ఎంపీడీవో సుభాషిణి, ఎమ్మార్వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ జయశ్రీ కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# కాంచనపల్లి సర్పంచి రేసు బుచ్చిరెడ్డి ని పరామర్శించిన ఎమ్మెల్యే కుంభం.



**వలిగొండ మండలం, న్యూస్ ఇండియా ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో కంచనపల్లి సర్పంచ్డ వలిగొండ సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి ఇటీవలే అనారోగ్యానికి గురై కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డిలి

వారివెంట వలిగొండకు చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఎస్ ఆర్ గార్డెన్స్ నందు మెగా జాబ్ మేళా

మన ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు శుభవార్త!




**చింతకాని న్యూస్ ఇండియా ప్రతినిధి** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో తేదీ: 04 మే 2026 న, ఉదయం 9:00 గంటల నుండి ఖమ్మంలోని ఎస్.ఆర్. గార్డెన్స్ నందు మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుంది.లి

18 సంవత్సరముల నుండి 30 సంవత్సరాల వయస్సు కలిగి, టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను 80 కంపెనీల భాగస్వామ్యంతో 3,200కు పైగా ఉద్యోగ అవకాశాలతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది.

ఈ జాబ్ మేళాలో సాఫ్ట్వేర్, బ్యాంకింగ్, ఐటి, ఫార్మా, ఉత్పత్తులు, మార్కెటింగ్, టెలికమ్యూనికేషన్, క్లస్టర్ కేర్ సెంటర్, లాజిస్టిక్స్ మొదలగు రంగాలలో ఉద్యోగ అవకాశాలు కలవు.

కావున ఈ సువర్ణ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులందరూ సద్వినియోగం చేసుకొనవలసినదిగా కోరుచున్నాము.

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం

## ఎడిటోరియల్

### ఇంటి పుడ్డు “సో బెటర్”

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రధానమైన ఫుడ్ ఇండ్రస్ట్రీ కుదుపుకు లోనయింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను ఒక్కసారిగా పెంచడంతో హోటల్స్ యజమానులు కూడా ధరలను పెంచేశారు. టిఫిన్లు, భోజనం ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు అందకుండా పోయాయి. చిన్న చిన్న హోటళ్లు కూడా ధరలు పెంచడంతో ఇంటి భోజనమే బెటర్ అన్న భావనకు అధిక మంది వచ్చే శారు. ఒక్కసారిగా కమర్షియల్ సిలిండర్ ధరను వెయ్యి రూపాయలకు పెంచడంతో ఒక సిలిండర్ ధర మూడు వేల రూపాయలకు చేరుకుంది.

**గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచడంతో...**

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం, హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఎల్.పి.జి కొరత గత కొన్ని నెలల నుంచి ఎదురవుతుంది. కమర్షియల్ సిలిండర్లను అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటికీ అవి సక్రమంగా డెలివరీ కావడం లేదు. దీనికి తోడు ఇప్పుడు ధరలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఫుడ్ ఇండ్రస్ట్రీపై ప్రభావం పడుతుంది. ఇప్పటికే భోజనం ధర రెండు వందల రూపాయలు దాటేసింది. ఈ సిలిండర్ ధరను పెంచడంతో ఇంకెంతగా పెంచుతారన్నది అర్థం కాకుండా ఉంది.

**కేవలం ఫుడ్ ఇండ్రస్ట్రీపైనే కాదు...**

ఈ ప్రభావం కేవలం ఫుడ్ ఇండ్రస్ట్రీపైనే పడి ఆగిపోదు. పర్యాటక రంగంపై కూడా పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. బయటకు వచ్చి కాస్త ఎంజాయ్ చేయాలన్నా, ఆధ్మాత్మిక కేంద్రాలను సందర్శించాలన్నా హోటల్ ఫుడ్ తినాల్సిందే. ఉదాహరణకు హైదరాబాద్ కు వేసవి కాలంలో పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. తిరుమలతో పాటు పలు ఆధ్మాత్మిక క్షేత్రాలు కూడా కిటకిట లాడుతుంటాయి. అయితే ఇప్పుడు ఫుడ్ రేట్స్ పెరగడంతో పర్యాటకరంగంపైనా, హోటల్స్ రంగంపైన కూడా ప్రభావం చూపే అవకాశముంది. దీంతో అనేక రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్... ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!


**మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్లలో ముఖ్యమైనది బ్రెస్ట్ క్యాన్సర్**

**పురుషుల్లోనూ అరుదుగా కనిపించే రొమ్ము క్యాన్సర్**

**ప్రతి 1000 మంది పురుషుల్లో ఒకరు దీని బారినపడే అవకాశం**

**ముందుగా గుర్తించడమే చాలా ముఖ్యం**

రొమ్ము క్యాన్సర్... ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో చాలామందిని కబళించే క్యాన్సర్లలో ఇది ముఖ్యమైనది. మహిళలే కాదు, పురుషుల్లోనూ కొందరు రొమ్ము క్యాన్సర్ బారినపడుతుంటారు. ప్రతి 1000 మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్ బాధితులు అయ్యే అవకాశం ఉందని గురుగ్రామ్ కు చెందిన ఆన్ క్వెస్ట్ ల్యాబొరేటరీ మాలిక్యులర్ బయాలజీ అధిపతి డాక్టర్ వినయ్ భాటియా వెల్లడించారు.
అయితే మహిళలకు మమ్మోగ్రామ్ వంటి టెస్టుల ద్వారా రొమ్ము క్యాన్సర్ ను ముందే పసిగట్టే అవకాశం ఉండగా, పురుషులకు నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన ముందస్తు పరీక్షలు దాదాపుగా లేవనే చెప్పాలి. దాంతో, పురుషులు తమ రొమ్ము కణజాలంలో జరిగే మార్పులను గుర్తించలేక, అవి సాధారణమైన మార్పులే అనుకుని బ్రెస్ట్ క్యాన్సర్ మరింత ముదిరిపోయే ప్రమాదం తెచ్చుకుంటున్నారని డాక్టర్ వినయ్ భాటియా వివరించారు. పురుషుల్లో 60-70 ఏళ్ల వయసున్న వారిలో రొమ్ము క్యాన్సర్ కేసులు అత్యధికం. కుటుంబ గత చరిత్రను పరిశీలిస్తే, ఆ కుటుంబంలోని మహిళలు ఎవరైనా రొమ్ము క్యాన్సర్ కు గురైతే, ఆ కుటుంబంలోని పురుషులు రొమ్ము క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఉంటాయి. మహిళలకు మాదిరే రొమ్ము భాగంలో గడ్డలు ఏర్పడతాయి. రొమ్ము బుడిపెల నుంచి రక్తం కారడం, ఇతర స్రావాలు బయటికి రావడం, రొమ్ము బుడిపెలు కుచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాదు, రొమ్ము పక్కన ఉండే చర్మంలో మార్పులు, నొప్పి



వంటి అదనపు లక్షణాలు పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ కు సంకేతాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం తీసుకోవాలి. పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ ను గుర్తించేందుకు పూర్తిస్థాయి శారీరక పరీక్షలు, ఎక్స్ రే, బయాప్సీ, హిస్టోపాథాలనీ, హార్మోన్ రిసెప్టర్ పరీక్షలు నిర్వహిస్తారు.

# ఈ జీవనశైలితో మరణ ముప్పు తక్కువ

**మొక్కల ఆధారిత ఆహారానికి ప్రాధాన్యం**

**కూరగాయలు, పండ్లు తీసుకోవాలి**

**ఉప్పు, చక్కెర తగ్గించేయాలి**

**తగినంత నిద్ర, స్నేహితులతో గడపడం ముఖ్యం**

ఉన్నంత కాలం ఆరోగ్యంగా జీవించాలి. ఆరోగ్యమే ఉంటే దీర్ఘకాలం పాటు నిశ్చింతగా జీవించొచ్చు. ఆరోగ్యానికి, ఆయుర్దాయానికి మధ్య అనుబంధం ఉంది. అందుకే ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలి. హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం.. మెడిటేరియన్ జీవన విధానాన్ని ఆచరించే వారికి ముందస్తు మరణం ముప్పు తగ్గుతున్నట్టు ప్రకటించారు.
మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అంటే.. మొక్కల ఆధారిత ఆహారానికే పరిమితం కావడం. సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం, ఇతరులతో మంచి స్నేహ సంబంధాలు కొనసాగించడం. శారీరక చర్యలు ఉండేలా చూసుకోవడం. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతోకూడిన ఆహారం తీసుకోవడం. ఈ విధానంలో ఉప్పు, చక్కెరలు గణనీయంగా తగ్గించేయాలి. తగినంత నిద్ర ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.
1,10,799 మంది జీవన అలవాట్లను పరిశోధకులు



అధ్యయనం చేశారు. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్ లో ఈ అధ్యయనం జరిగింది. తీసుకుంటున్న ఆహారం ఎలా ఉంటుంది? జీవనశైలిపై ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మూడు విభాగాలుగా వర్గీకరించి, వాటిపై ప్రశ్నలు సంధించారు. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతో కూడిన ఆహారం. శారీరకరంగా శ్రమిస్తూ, తగినంత నిద్ర పోవడం, స్నేహితులతో గడపడం, ఉప్పు, చక్కెరలు తగ్గించడం గురించి తెలుసుకున్నారు.
తొమ్మిదేళ్ల తర్వాత గమనిస్తే, 4,247 మంది మరణించారు. ఒక్క కేన్సర్ వల్లే 2,401 మంది ముందస్తుగా ప్రాణాలు కోల్పోతే, 731 మందిని గుండె జబ్బులు బలి తీసుకున్నాయి. మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అనుసరించే విషయంలో మంచి స్కోరు ఉన్న వారికి మరణ ముప్పు 29 శాతం తక్కువగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. ఇదేదో బావుందని చెప్పి వెంటనే మెడిటేరియన్ డైట్ ప్రారంభించకండి. పోషకాహార నిపుణులను సంప్రదించిన తర్వాతే, తమకు అనుకూలమైన విధంగా మెనూను అనుసరించడం మంచిది.

# నిద్రకు ముందు పసుపు కలిపిన పాలు సేవిస్తే ఎన్నో లాభాలు

**పసుపులో ఎన్నో ఆరోగ్య సుగుణాలు**

**ఇన్ ఫ్లమ్మేషన్ నుంచి ఉపశమనం**

**రక్తాన్ని శుద్ధి చేసే సామర్థ్యం**

పసుపు కలిపిన పాలను తాగడం అన్నది ఎన్నో తరాల నుంచి ఉంది. దీన్ని గోల్డెన్ మిల్క్ అని కూడా పిలుస్తారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. తమ ఆరోగ్యాన్ని సహజసిద్ధంగా పెంచుకోవాలని చూసే వారికి ఇదొక మంచి ఔషధం అవుతుంది. పసుపులో యాంటీ మైక్రోబయల్, రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు ఉన్నాయి. కనుక నిద్రించడానికి ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి. దీనివల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల మొత్తం మీద ఆరోగ్యం పటిష్ఠమవుతుంది.
పసుపులో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ప్రాపర్టీలు ఉంటాయి. కనుక వ్యాధి నిరోధక శక్తి బలంగా మారడానికి ఇవి తోడ్పడతాయి. పసుపుకు రక్తాన్ని శుద్ధి చేసే సామర్థ్యం కూడా ఉంది. పసుపులోని ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ బరువు తగ్గేందుకు అనుకూలిస్తాయి. చర్మం ఆరోగ్యానికి పసుపు మంచిది. వయసు పెరుగుతున్న దశలో చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. ముఖ్యంగా పుసుపులోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యంలోని వారికి ఎంతో అవసరం. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. కడుపుబ్బరాన్ని తగ్గిస్తుంది. గాల్ బ్లాడర్ లో బైల్ తయారికి సాయపడుతుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లమ్మేషన్ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. దీంతో రోజు రాత్రి పసుపు పాలను తాగడం వల్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# హీరోలే డూప్‌లు వాడేస్తుంటే ఇంత సాహసం ఎందుకు?



గత కొంత కాలంగా స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలకు హై రిస్క్ ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం బాడీ డబుల్‌ని వాడేస్తున్నారని, సాహసాలు చేయడానికి ఇష్టపడటం లేదని, అయితే ఈ విషయాన్ని హీరోలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని నటుడు, డైరెక్టర్ రవిబాబు ఇటీవల ఓ బాంబ్ పేల్చిన విషయం తెలిసిందే. హీరోలు ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది పలు క్రేజీ సినిమాల్లో నటించి టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలిచిన రష్మిక ప్రస్తుతం భర్త విజయ్ దేవరకొండతో కలిసి -రణబాలి-లో నటిస్తూనే ఓ పవర్ ఫుల్ స్టోరీతో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా -మైసా-లో నటిస్తోంది. దీనికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక ఈ సినిమా కోసం ఎంత రిస్క్ చేయడానికైనా వెనుకాడటం లేదు. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేని విధంగా రష్మిక మందన్న ఓ సాహసం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం గోండు తెగకు చెందిన ముృవతిగా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ సినిమా కోసం రష్మిక తాజాగా పెద్ద రిస్కే చేసిందని తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా డైరెక్టర్ రవీంద్ర పుల్లె వెల్లడించడంతో అంతా షాక్ అవుతున్నారు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక పాత్ర చాలా ప్రభావ వంతంగా ఉంటుందని, ఆమె ప్రదర్శించే కోపం, ఆవేః ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయన్నారు.

ఇటీవల కేరళలోని అతిర జలపాతం వద్ద అత్యంత క్లిష్టమైన ఓ యాక్షన్ సీన్‌ని షూట్ చేశాం. అయితే ఈ సన్నివేశం కోసం రష్మిక 80 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి డూప్ లేకుండా దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా పట్ల, నటన పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి టీమ్ అంతా ఆశ్చర్యపోయాం- అన్నారు. అయితే ఈ విషయం తెలిసిన నెటిజన్‌లు, అభిమానులు మాత్రం స్టార్ హీరోలే రిస్కీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడానికి భయపడుతున్నారు. ఇందు కోసం బాడీ డబుల్‌లని వాడేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి డూప్ లేకుండా ఇలా రిస్క్‌లు చేయడం అవసరమా? అని వాపోతున్నారు. 80 అడుగుల ఎత్తులో నుంచి దూకడం అనేది కరెక్ట్ కాదని, ఇకపై అలాంటి రిస్క్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.



**సోనాల్ చౌహాన్ యొక్క పూల్‌సైడ్ ఫోటోషూట్ వైరల్‌గా మారింది**



**కృతి శెట్టి ఎలిగెంట్ ఎత్నిక్ గ్లామ్‌లో మెరిసింది**

# 'దేవర 2'.. ఇది మ్యాటర్!




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ఇప్పుడు దేవర 2పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ పార్ట్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో, సీక్వెల్ పై అంచనాలు మరింత పెరిగాయి. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఇప్పటికే రూ.1000 కోట్ల బొమ్మ అంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే నిజంగా ఆ రేంజ్ సాధ్యమేనా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం ఎన్టీఆర్.. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న డ్రాగన్ షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన వెంటనే ఆయన ఫ్రీ అవుతారని సమాచారం. అదే సమయంలో దర్శకుడు కొరటాల శివ కూడా నందమూరి బాలకృష్ణతో చేయనున్న చీదీఖ112 ప్రాజెక్టు పూర్తి చేస్తారు. ఆ రెండు సినిమాలు ముగిసిన తర్వాతే దేవర 2 సెట్స్ పైకి వెళ్ళే అవకాశం ఉందని తెలుస్తోంది.పాన్ ఇండియా రేంజ్ లో భారీ విజయం సాధించిన ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ నుంచి వచ్చిన సినిమా దేవర. దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన ఆ చిత్రం, రాజమౌళి సెంటిమెంట్ ను బ్రేక్ చేస్తూ మంచి వసూళ్లు సాధించింది. సాధారణంగా జక్కన్న సినిమా తర్వాత హీరోలకు వెంటనే హిట్ రావడం కష్టమనే అభిప్రాయం ఉంది. కానీ దేవర ఆ ట్రెండ్ ను చెరిపేసింది. సుమారు రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఎన్టీఆర్ కెరీర్ లో సోలో హీరోగా అతిపెద్ద హిట్ గా నిలిచింది.ఇప్పుడు ఆ విజయానికి సీక్వెల్ గా వస్తున్న దేవర 2 మూవీపై అంచనాలు నేచురల్ గానే పెరిగాయి. ముఖ్యంగా కథలో పెద్ద మార్పులు చేసినట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, షూటింగ్ షెడ్యూల్ కూడా సిద్ధమైందని తెలుస్తోంది. హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా, విలన్ పాత్రలో బీటౌన్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కనిపించనున్నారు.మరోవైపు, ఎన్టీఆర్ ఇప్పటివరకు సోలోగా రూ.1000 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టలేదు. ఆర్ఆర్ఆర్ తో మాత్రం రామ్ చరణ్ తో కలిసి ఆ రికార్డును అందుకున్నారు. దీంతో అభిమానులు డ్రాగన్, దేవర 2 ద్వారా తారక్ ఆ ఘనతను సొంతం చేసుకోవాలని ఆశిస్తున్నారు. అయితే రూ.1000 కోట్ల మార్క్ చేరుకోవాలంటే కేవలం స్టార్ పవర్ సరిపోదని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు.సినిమాలోని కథ, కంటెంట్, పాన్ ఇండియా రీచ్, మార్కెటింగ్ సహా అన్ని ఫ్యాక్టర్స్ కీలకం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో, మంచి కథతో పాటు భారీ విజువల్ ట్రీట్ ఇస్తే దేవర 2 ఆ రేంజ్ ను టచ్ చేసే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. మొత్తానికి దేవర 2పై ఆడియన్స్ లో హైప్ మాత్రం భారీగానే ఉంది. కానీ ఆ హైప్ ను కలెక్షన్లుగా మార్చగలిగితేనే ఇది నిజమైన రూ.1000 కోట్ల బొమ్మగా నిలుస్తుంది. మరి తారక్ ఫ్యాన్స్ ఆశలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com